AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN

శతాబ్దపు గొప్ప సంఘటన : మోదీ

అక్షరటుడే, నేషనల్‌డెస్క్: భారత్ - అమెరికా వాణిజ్య ఒప్పందంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇది ఈ శతాబ్దపు గొప్ప సంఘటనగా ఆయన అభివర్ణించారు. ఢిల్లీలో మంగళవారం జరిగిన ఎన్డీఏ పార్లమెంటరీ సమావేశంలో మోదీ మాట్లాడారు. వాణిజ్య ఒప్పందంపై స్పందిస్తూ.. ఇది ప్రపంచ వేదికపై భారత్ ప్రభావాన్ని ప్రతిబింబిస్తుందని చెప్పారు. ప్రపంచ వ్యవహారాల్లో భారతదేశం కేంద్ర పాత్రధారిగా వేగంగా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. ప్రపంచ సమతుల్యతను కాపాడుకోవడంలో దాని పాత్ర మరింత కీలకంగా మారుతోందన్నారు. ట్రంప్ భారతీయ వస్తువులపై సుంకాలను తగ్గించాలనే నిర్ణయంతో కొంతమంది వినాశనానికి గురయ్యారని ప్రధాని వ్యాఖ్యానించారు.

యాదగిరిగుట్ట వరకు ఎంఎంటీఎస్ రైలు

అక్షరటుడే, హైదరాబాద్: రాష్ట్ర ప్రజలకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి శుభవార్త చెప్పారు. హైదరాబాద్ నగరం నుంచి యాదగిరిగుట్ట మధ్య ఎంఎంటీఎస్ మూడో దశ పనులను త్వరలో ప్రారంభిస్తామన్నారు. నాంపల్లిలోని పార్టీ కార్యాలయంలో కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందని కాంగ్రెస్ ఆరోపిస్తున్న నేపథ్యంలో ఆయన స్పందించారు. హైదరాబాద్-యాదగిరిగుట్ట ఎంఎంటీఎస్ పనులకు ప్రధాని నరేంద్ర మోదీ త్వరలో భూమి పూజ చేస్తారని తెలిపారు. బడ్జెట్ అంటే ఉచితాలనే భావన ఉందన్నారు. అది సరికాదని చెప్పారు.

3-2-2026 (Tuesday) MAIN EDITION

మాజీమంత్రి కాకాణికి నోటీసులు

అక్షరటుడే, ఏపీ: నెల్లూరులో నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి నోటీసులు జారీ అయ్యాయి. సీఎం చంద్రబాబు, స్థానిక ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిపై అసభ్యవ్యాఖ్యలు చేసినందుకు ఆయనపై కేసులు నమోదయ్యాయి. నెల్లూరు రూరల్‌తో పాటు పాదలకూరు, మనుబోలులో కేసులు పెట్టారు.

మెటాపై సుప్రీంకోర్టు ఆగ్రహం



అక్షరటుడే, ఢిల్లీ: ప్రైవసీ పాలసీ విషయంలో వాట్సప్ మాతృ సంస్థ మెటాపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. 'మీరు మా దేశ గోప్యతతో ఆడుకోలేరు. మా డేటాలోని ఒక్క అంకెను కూడా పంచుకోవడానికి మేం అనుమతించం. ఒకవేళ దేశ చట్టాలను పాటించకపోతే భారత్‌ను వీడి వెళ్లొచ్చు' సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ హెచ్చరించారు.

ఏథర్ ఎనర్జీ సరికొత్త రికార్డు..



అక్షరటుడే, బిజినెస్ డెస్క్: ఏథర్ ఎనర్జీ, 2025-26 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో అద్భుత పనితీరు కనబరిచింది. గతేడాదితో పోలిస్తే కంపెనీ ఆదాయం 53 శాతం వృద్ధి చెంది ₹995.7 కోట్లకు చేరింది. ఆదాయం పెరగడమే కాకుండా, నిర్వహణ వ్యయాలను అదుపులో ఉంచడం ద్వారా కంపెనీ తన నష్టాలను భారీగా తగ్గించుకోగలిగింది.

> భారత్, అమెరికా మధ్య ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న వాణిజ్య ఒప్పందం కుదిరింది. రెసిప్రోకల్ టారిఫ్‌స్‌ను 18 శాతానికి తగ్గిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. దీంతో భారత స్టాక్ మార్కెట్లు భారీగా పెరిగాయి. ట్రంప్ చర్యలతో కొన్ని రోజులుగా ఒడిదుడుకులకు లోనవుతున్న మార్కెట్లు మంగళవారం రికార్డు స్థాయిలో దూసుకు పోయాయి. దీంతో ఇన్వెస్టర్ల సంపద భారీగా పెరిగింది.
>
> -అక్షరటుడే, బిజినెస్ డెస్క్

మార్కెట్‌కు ట్రేడ్ డీల్.. బూస్ట్..

- సుంకాలు తగ్గించిన అమెరికా
- భారీ లాభాల్లో దేశీయ సూచీలు

డొనాల్డ్ ట్రంప్ అమెరికాకు రెండోసారి అధ్యక్షుడు అయ్యాక "అమెరికా ఫస్ట్" విధానాన్ని అవలంభించారు. తమ వస్తువులపై భారత్ అధిక సుంకాలు విధిస్తోందని ఆరోపించిన ట్రంప్.. అమెరికాతో వాణిజ్య లోటును తగ్గించుకోవాలంటూ వాదించారు. తమతో వాణిజ్య ఒప్పందం చేసుకోకపోతే ప్రతీకార సుంకాలు విధాస్తామని హెచ్చరించారు. ఇరు దేశాల మధ్య ఒప్పందం కుదరకపోవడంతో గతేడాది జూలైలో 25 శాతం టారిఫ్స్ విధించారు. అనంతరం రష్యా నుంచి చవకగా ముడి చమురు, రక్షణ పరికరాలను కొనుగోలు చేస్తూ ఉక్రెయిన్ యుద్ధం ముగియకుండా అడ్డుపడుతున్నారంటూ మరో 25శాతం అదనపు సుంకాలను వడ్డించారు. దీంతో సుంకాలు 50 శాతానికి పెరిగాయి. ఈ సుంకాల వల్ల భారత వస్తువులు అమెరికాలో ఖరీదయ్యాయి. ధరలు పెరగడంతో ఎగుమతులు తగ్గాయి. సెప్టెంబర్-నవంబర్ మధ్య భారతదేశం దాదాపు 19 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులను యూఎస్‌కు ఎగుమతి చేసింది. అంతకుముందుతో పోల్చితే సుంకాల పెంపు తర్వాత 6 బిలియన్ డాలర్లకు పైగా విలువైన ఎగుమతులు.. అంటే మూడో వంతు తగ్గాయి. అనేక శ్రమ ఆధారిత, వస్తువుల విభాగాల్లో ఎగుమతులు కుప్పకూలాయి. ప్రధానంగా బాస్మతి బియ్యం ఎగుమతులు సున్నాకు పడిపోయాయి. అంతకుముందు ఏడాది ఇదే త్రైమాసికంలో 83 మిలియన్ డాలర్ల విలువైన ఎగుమతులు జరిగాయి. పామ్‌ఫ్రెట్ ఎగుమతులు కూడా అతితక్కువ స్థాయికి పడిపోయాయి, మొక్కజొన్న మరియు మొక్కజొన్న పిండి ఎగుమతులు కూడా ఇదే స్థాయిలో తగ్గాయి. రత్నాలు, ఆభరణాలపై ట్రంప్ టారిఫ్‌ల ప్రభావం తీవ్రంగా ఉంది. సుంకాలు అమల్లోకి వచ్చిన తర్వాత పారిశ్రామికేతర వజ్రాల ఎగుమతులు 96 శాతం పడిపోయాయి. బంగారు ఆభరణాల ఎగుమతులు దాదాపు 50 శాతం తగ్గాయి. నల్ల మిరియాలు, టీ బ్యాగులు, బ్యాటరీ చార్జర్‌ల ఎగుమతులు కూడా సగానికి తగ్గాయి. ఉన్ని జాకెట్లు, బ్లేజర్లు, సంవత్సరానికి 35 శాతం తగ్గుదల నమోదు చేశాయి.

భారీ లాభాల్లో సూచీలు..

ట్రేడ్ డీల్ విషయంలో దక్షిణాసియాలోని పొరుగు దేశాలు, కీలక ఎగుమతి పోటీదారుల కంటే మన దేశమే పైచేయి సాధించినట్లయ్యింది. ప్రస్తుతం చైనాపై అధికంగా 34 శాతం వరకు సుంకాలు ఉండగా.. బంగ్లాదేశ్, శ్రీలంకపై 20 శాతం, పాకిస్థాన్‌పై 19 శాతం ఉన్నాయి. పోటీదారుల కంటే మనదేశ ఎగుమతులపైనే తక్కువ సుంకాలు ఉండడంతో దేశీయ స్టాక్ మార్కెట్ పరుగులు తీస్తోంది. మంగళవారం భారీ లాభాలతో ప్రారంభమైన సూచీలు.. ఇంట్రాడేలో సెన్సెక్స్, నిఫ్టీ గరిష్టంగా ఐదు శాతానికిపైగా పెరిగి గత ఐదేళ్లలో అత్యుత్తమ రోజును నమోదు చేశాయి.

చర్చలు ఫలించి..

ఇరు దేశాల మధ్య ట్రేడ్ డీల్ కోసం భారత్, అమెరికా దేశాల ప్రతినిధుల మధ్య పలు దఫాలు చర్చలు జరిగాయి. ఒప్పందంపై ఎటూ తేలకపోవడంతో స్టాక్ మార్కెట్‌పై తీవ్ర ప్రభావం పడింది. ఫారిన్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లు మన మార్కెట్లలో పెట్టుబడులను ఉపసంహరిచడంతో రూపాయి విలువ క్షీణించింది. ఇన్వెస్టర్లు భారీగా నష్టపోయారు. ఈలోగా భారత్ వివిధ దేశాలతో ట్రేడ్ డీల్స్ చేసు కుంటూ ముందుకెళ్లింది. ఇటీవల ఈయూతో కుదిరిన ఒప్పందం అమెరికాను కలవరపెట్టింది. దీంతో యూఎస్ సైతం భారత్‌తో వాణిజ్య ఒప్పందం చేసుకుంది. భారత్, అమెరికాల మధ్య ఒప్పందా నికి అంగీకారం కుదిరిందని, ఇకపై భారత్ నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై సుంకాలను 18 శాతానికి తగ్గిస్తున్నామని డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. రష్యా నుంచి ముడి చమురు కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌పై విధించిన 25 శాతం అదనపు సుంకాలను అమెరికా ఉపసంహరించుకోవడంతో ఇంధన ఖర్చులు తగ్గి, ఎగుమతిదారులకు భారీ ఊరట కలగనుంది.

రెండు లక్షల ఉద్యోగాలపై కాంగ్రెస్ మోసం..: కేటీఆర్

అక్షరటుడే, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వంపై మరోసారి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. మరో గ్యారంటీ నుంచి సీఎం రేవంత్‌రెడ్డి ముఖం చాటేశారన్నారు. అధికారంలోకి వస్తే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని కాంగ్రెస్ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. అయితే ఇటీవల పీసీసీ అధ్యక్షుడు మాట్లాడుతూ.. రెండు లక్షల ఉద్యోగాల హామీ ఐదేళ్లలో నెరవేరుస్తామన్నారు. ఆయన వ్యాఖ్యలపై కేటీఆర్ 'ఎక్స్' వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. తొలి సంవత్సరమే రెండు లక్షల నియామకాలు చేపట్టకపోతే ప్రభుత్వాన్ని దించేయండని ఢిల్లీ నుంచి వచ్చి మరీ చెప్పిపోయిన ప్రియాంక గారి మాట అమలై ఉంటే.. ఈ సర్కారు కుప్పకూలి ఇప్పటికే ఏడాది పూర్తయ్యేదని విమర్శించారు.

కడియం శ్రీహరికి స్పీకర్ నోటీసులు

అక్షరటుడే, హైదరాబాద్: స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి స్పీకర్ ప్రసాద్ కుమార్ మంగళవారం నోటీసులు ఇచ్చారు. బుధవారం ఉదయం 11 గంటలకు విచారణకు హాజరు కావాలని ఆదేశించారు. కడియం శ్రీహరి బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. అనంతరం ఆయన కాంగ్రెస్ గూటికి చేరారు. వరంగల్ ఎంపీగా కాంగ్రెస్ నుంచి తన కూతురిని గెలిపించుకున్నారు. కడియంపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ పెండింగ్‌లో ఉంది. మొత్తం పది మంది ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించినట్లు బీఆర్ఎస్ పేర్కొంది. ఈ మేరకు 8 మంది అనర్హత పిటిషన్లపై స్పీకర్ ఇప్పటికే విచారణ చేపట్టారు. అందులో ఏడుగురికి క్లీన్ చిట్ ఇస్తూ పిటిషన్లను కొట్టివేశారు. వారు పార్టీ మారినట్లు ఎలాంటి ఆధారాలు లేవన్నారు. కడియం శ్రీహరిని స్పీకర్ బుధవారం ఉదయం 11 గంటలకు విచారణకు హాజరు కావాలని ఆదేశించారు.

ట్రేడ్ డీల్.. మోదీపై కాంగ్రెస్ విమర్శలు

అక్షరటుడే, నేషనల్ డెస్క్: భారత్-అమెరికా మధ్య సోమవారం వాణిజ్య ఒప్పందం కుదిరిన విషయం తెలిసిందే. భారత్‌పై విధిస్తున్న సుంకాలను 18 శాతం తగ్గిస్తామని యూఎస్ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనపై కాంగ్రెస్ పార్టీ మంగళవారం నరేంద్ర మోదీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించింది. ఈ ఒప్పందానికి సంబంధించిన కీలక వివరాలను వెల్లడించాలని కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ డిమాండ్ చేశారు.

హెచ్‌సీఏ అధ్యక్షుడిగా అమర్‌నాథ్

అక్షరటుడే, హైదరాబాద్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అమర్‌నాథ్ నియమితులయ్యారు. గెలాక్సీ క్రికెట్ క్లబ్‌కు చెందిన ఆయనను నియమిస్తూ.. అంబుడ్స్‌మన్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. హెచ్‌సీఏ ఎన్నికలు 2023లో జరిగాయి. ఆ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని, ఫోర్జరీ పత్రాలతో జగన్ మోహన్ రావు పోటీ చేశారని అమర్‌నాథ్ ఫిర్యాదు చేశారు. దీనిపై అంబుడ్స్‌మన్ జస్టిస్ సురేష్ కుమార్ కైత్ విచారణ చేపట్టి జగన్‌మోహన్‌రావు ఎన్నిక చెల్లదని ప్రకటించారు. సంస్థ కార్యకలాపాలు ఆగిపోకూడదని రెండో స్థానంలో 62 ఓట్లు సాధించిన అమర్‌నాథ్‌ను అధ్యక్షుడిగా ప్రకటించారు. వారం రోజుల్లో బాధ్యతలు చేపట్టాలని అమర్‌నాథ్‌కు సూచించారు.

జగిత్యాలలో జీవన్‌రెడ్డి వర్సెస్ సంజయ్

అక్షరటుడే, జగిత్యాల: అధికార కాంగ్రెస్ పార్టీలో మున్సిపల్ టికెట్ల కోసం పంచాయితీ నెలకొంది. జగిత్యాల కాంగ్రెస్‌లో కొంతకాలంగా వర్గపోరు నెలకొన్న విషయం తెలిసిందే. మాజీ మంత్రి జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ మధ్య పొసగడం లేదు. మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా పట్టణంలో 50 వార్డులకు కాంగ్రెస్ అధిష్టానం అభ్యర్థులను ప్రకటించింది. అయితే ఇందులో సంజయ్ వర్గానికి 30, జీవన్‌రెడ్డి వర్గానికి 20 సీట్లు కేటాయించినట్లు సమాచారం. దీంతో జీవన్‌రెడ్డి అనుచరులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు అన్యాయం జరిగిందని జీవన్‌రెడ్డి అనుచరులు పార్టీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. మొత్తం 50 వార్డుల్లో స్వతంత్రంగా పోటీలో ఉంటామని వారు ప్రకటించారు. ఆ 20 టికెట్లు కూడా వద్దన్నారు. టికెట్ల వివాదం నేపథ్యంలో ఎమ్మెల్యే సంజయ్ ఇంటి వద్ద, క్యాంపు కార్యాలయం వద్ద భారీగా పోలీసులు మోహరించారు.

టాలెంటే నటులను నిలబెడుతుంది..

సినీ ఇండస్ట్రీలో ముఖ్యంగా బాలీవుడ్‌లో ప్రస్తుతం పీఆర్ (పబ్లిక్ రిలేషన్స్) సంస్కృతి బాగా పెరిగిపోయింది. మూవీ రిలీజ్ అయినా, వ్యక్తిగత విషయాలైనా.. ప్రతి అంశంలో పీఆర్ టీమ్స్ కీలక పాత్ర పోషిస్తున్నాయి. అయితే ఆ వ్యవస్థలపై స్టార్ హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పీఆర్ వల్లే స్టార్ డమ్ వస్తుందనే ఫీలింగ్‌ను ఖండించారు. ప్రమోషన్స్, లాబీయింగ్ కంటే కష్టం, టాలెంట్ నటుడిని నిలబెడుతుందని ఆమె స్పష్టం చేశారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. పీఆర్ వ్యవస్థలు ఒక స్థాయి వరకు పనిచేస్తాయని చెప్పుకొచ్చారు రకుల్ ప్రీత్ సింగ్. మనం ఎంత కష్టపడి పని చేస్తామో, మన టాలెంట్ ఏ రేంజ్‌లో ఉంటుందో అదే కెరీర్‌ను డిసైడ్ చేస్తుందన్నారు. కేవలం ప్రచారం వల్ల ఎక్కువ రోజులు ఎవ్వరూ నిలబడలేరని క్లారిటీ ఇచ్చారు.

–అక్షరటుడే, సినిమాడెస్క్

లోక్‌సభలో విపక్ష సభ్యుల ఆందోళన.. 8 మంది సస్పెండ్

అక్షరటుడే, నేషనల్ డెస్క్: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో మంగళవారం గందరగోళం నెలకొంది. విపక్ష ఎంపీలు ఆందోళన నిర్వహించారు. అనంతరం స్పీకర్ ముందున్న టేబుల్ ఎక్కి నిరసన తెలిపారు. ప్యానెల్ స్పీకర్‌పైకి పేపర్లు విసిరారు. దీంతో స్పీకర్‌పైకి పేపర్లు విసిరిన 8 మంది విపక్ష ఎంపీలపై వేటు వేశారు. ప్రస్తుత సెషన్ ముగిసేవరకూ లోక్‌సభ నుంచి వారిని సస్పెండ్ చేశారు. వారిలో తెలంగాణ ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి సైతం ఉన్నారు.